క్లుప్తంగా

నేడు సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ

జే.పంగులూరు: నేడు మండల పరిధిలోని 21 గ్రామాల సర్పంచ్‌లకు గ్రామ పంచాయతీ నిర్వాహణపై శిక్షణ కార్యక్రమం జరగనున్నట్లు సీనియర్ అసిస్టెంట్ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిక్షణ కార్యక్రమంలో జీపీడీపీ, ఎస్‌డబ్ల్యూపీఎస్, పంచాయతీ ఎల్ఈడీ వీధి బల్బులు వాటి నిర్వహణ ఖర్చులు, పంచాయతీలకు వచ్చిన ఆదాయాలపై ఖర్చు చేయాల్సిన విధివిధానాలు, ఉదయం 9 నుంచి 6 గంటలకు 3 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు.

కారంచేడు: ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మండల పరిషత్ సమావేశ హాలులో గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు జీపీడీపీపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే ఈ రీఫ్రెష్‌మెంట్ శిక్షణలో పారిశుధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ సెక్యూరిటీ, ఇతర అంశాపై జరుగుతుందన్నారు. ఈశిక్షణ తరగతులకు అన్ని గ్రామాల సర్పంచ్‌లతో పాటు, గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని ఆయన తెలిపారు.

కారంచేడు ఎంపీడీఓ బదిలీ

కారంచేడు: ఎన్నికల నియమావళిలో భాగంగా గుంటూరు జిల్లా నుంచి కారంచేడుకు వచ్చిన ఎంపీడీఓ బీ బాబూరావును తిరిగి గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు ఒంగోలు జెడ్పీ నుంచి వచ్చిన ఉత్తర్వులతో ఆయన వెళ్లారు. ఎంపీడీవో కార్యాలయం ఈఓగా విధులు నిర్వహిస్తున్న పీ లక్ష్మీనారాయణకు ఆయన భాధ్యతలు అప్పగించారు. ఇంకా కారంచేడు మండలానికి కొత్త ఎంపీడీవోను నియమించలేదు.

సూక్తిసుధ ఖండకావ్యం ఆవిష్కరణ నేడు

అద్దంకి: విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన 'సూక్తిసుధ' ఖండకావ్యాన్ని సోమవారం సాయంత్రం 2.30 గంటలకు ఆవిష్కరించనున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మద్రాసు యూనివర్శిటీ తెలుగు శాఖాధ్యక్షుడు విస్తాలి శంకరరావు హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. పలువురు సాహితీవేత్తలు హాజరు కానున్న ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

పాడి గేదెల మిస్సింగ్‌పై ఫిర్యాదు

కారంచేడు: ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న మూడు పాడి గేదెలు తప్పిపోడవంతో యజమాని కారంచేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రంగప్పనాయుడు వారిపాలెం గ్రామానికి చెందిన కాప హరి బాబుకు చెందిన సుమారు రూ.3 లక్షల విలువ చేసే మూడు పాడి గేదెలు ఎప్పటి మాదిరిగానే పొలం వైపునకు మేతకు వెళ్లాయి. మళ్లీ తిరిగి రాలేదు. దీంతో వారు కారంచేడు, చినగంజాం, ఇంకొల్లు, పర్చూరు, చీరాల, వేటపాలెం, యద్దనపూడి మండలాల్లోని అనేక ప్రాంతాలలో వెతికారు. అయినా వాటి ఆచూకి దొరకక పోవడంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వీటి ఆచూకి తెలిపిన వారు 70130 87379 నంబర్‌కు తెలిపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

సువార్తను వ్యాప్తి చేయడమే సేవా భారత్ లక్ష్యం


శామ్యూల్ ఆర్థర్

చీరాల రూరల్: దేవుడి సువార్తను దేశ నలుదిక్కులా వ్యాప్తి చేయడమే సేవా భారత్ లక్ష్యమని సేవా భారత్ ప్రతినిధి బ్రదర్ శామ్యూల్ ఆర్థర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో సేవా భారత్ సండేను నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ఆరాధన క్రమాలన్నింటిని సేవా భారత్ నిర్వాహకులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా చర్చి పాస్టర్ రెవరెండ్ పిల్లి దేవదాసు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థర్ ముఖ్య అతిథిగా పాల్గొని దేవుడి వాక్య సందేశాలు అందజేశారు. సేవా భారత్ దేవుని వాక్య పరిచర్యలో ఎంతో ముందజలో ఉందన్నారు. సేవా భారత్ ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ సంఘాలతో సేవా భారత్ మమేకమై పనిచేస్తుందన్నారు. సేవా భారత్‌ను డాక్టర్ చిరంజీవి ఆయన సతీమణి కలసి ఏర్పాటు చేశారని చెప్పారు. దేశంలోని 600 జిల్లాలలో వందల మంది ఎంతో ప్రయాసతో సువార్త పరిచర్యలు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్, ఎల్‌సీసీ, పీసీసీ, స్త్రీల సమాజం, యూత్, సంఘస్థులు పాల్గొన్నారు.

ధాన్యం మిల్లుల కనుమరుగు

- నూతన టెక్నాలజీతో ఆధునిక రైస్ మిల్లుల రాక
- భారంగా మారిన పాత తరం రైసు మిల్లుల నిర్వహణ
- ఉమ్మడి కుటుంబాలు కనుమరుగు
- బియ్యం కొనుగోలు చేసి తింటున్న రైతులు


వేటపాలెంలో జీడిపప్పు ఫ్యాక్టరీగా మారిన రైస్ మిల్లు

వేటపాలెం: ఆధునిక సాంకేతిక యుగంలో వ్యవసాయంలో ఎన్నో మార్పులు, మరెన్నో కొత్త ఆవిష్కరణలతో ముందుకు దూసుకెళ్తోంది. ముఖ్యంగా కూలీల కొరత, వ్యవసాయంపై తగ్గుతున్న మక్కువ కారణంగా నేడు భారమవుతోంది. ఫలితంగా కొత్త యాంత్రీకరణవైపు రైతులు అడుగులు వేస్తున్నారు. ఒకప్పుడు రైస్ మిల్లులకు చాలా ప్రాధాన్యత ఉండేది. ప్రస్తుతం వరి ధాన్యం రైస్ మిల్లులు లేక మూత పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 450 రైసు మిల్లులు ఉండేవి, ఇవి ఎక్కువగా వరి పండించే గ్రామాలు, పట్టణాల్లో ఉండేవి. చీరాల నియోజకవర్గ పరిధిలో చీరాల, వేటపాలెం ప్రాంతాల్లో 26 నుంచి 40 వరకు ఉండేవి. పూర్వ గ్రామీణ ప్రాంతాల్లో ఉమ్మడి కుటుంబాలు ఉండే పెద్దపెద్ద సేద్యాలు చేస్తుండేవారు. ప్రతి రైతు కుటుంబం తమ కుటుంబ పోషణ కోసం వరి, చిరుధాన్యాలు పండిచుకునే వారు. వీటిని తప్పనిసరిగా రైసు మిల్లులకు ఎద్దుల బండి, చెక్క రిక్షాలోనే తీసుకెళ్లి బియ్యం లేదా పిండి ఆడించి నిల్వ ఉంచుకునే వారు. ఆ రోజుల్లో ఇప్పటిలా విద్యుత్ అందుబాటులో లేక పోవడంతో ఆయిల్ ఇంజన్లతో నడిచే రైస్ మిల్లులు ఆడించేవారు. 1959లో ఆయిలు ఇంజన్‌తో నడిపే రైస్ మిల్లులను (అలంబీ) అనే పిలిచే వారు. ఈ మిల్లులోనే నేరుగా ధాన్యం ముడి బియ్యం రూపంలో వచ్చేవి. వీటిని రైతులు ఇంటి తీసుకెళ్లి ఉమ్మడి కుటుంబాల్లో వండుకొనేవారు. ప్రతి రైతు తప్పనిసరిగా ధాన్యం మిల్లులో అడించి బియ్యం తీసుకెళ్లేవారు. మార్కెట్‌లో బియ్యం కొనుగోలు చేసేవారు కాదు. అతి కొద్ది సంఖ్యలో మాత్రమే అప్పటిలో బియ్యం కొనుగోలు చేస్తుండేవారు. అందువలన అప్పటిలో రైస్ మిల్లుల వద్ద ఎప్పడూ సందడిగా ఉండేది. ఈ రైస్ మిల్లుల వద్ద రైతులు పొలానికి సంబంధించిన సంగతుల చర్చించుకుంటుండేవారు.


వేటపాలెంలో గోడౌనుగా మారిన రైస్ మిల్లు

1960లో కొత్త యంత్రాలతో రైస్ మిల్లుల రాక..

1960 తరువాత ఎక్కువ ప్రాంతాలకు విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. అనంతరం ఆయిల్ ఇంజన్లతో నడిచే రైసుమిల్లుల స్థానంలో విద్యుత్‌తో నడిచే కొత్త యంత్రాలతో రైస్ మిల్లులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఇవే రైస్ మిల్లులు ఎక్కువగా నడుస్తున్నాయి. అందులో నాలుగేళ్ల నుంచి నూతన టెక్నాలజీతో పట్టణ ప్రాంతాల్లో పెద్దరైస్ మిల్లులు ఏర్పా టు చేశారు. ఈపెద్ద రైస్ మిల్లులు ధాన్యం ఆడించగా బియ్యం నాణ్యంగా వస్తుంటుంది. అయితే పాతకాలం నాటి రైస్ మిల్లుల్లో ధాన్యం ఆడించగా వారికి కొంత మేర నూకలు, కొంత బియ్యం అందుతుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రైస్ మిల్లుల గిరాకీ పడిపోయింది.

రైతువారీ కుటుంబాలు తగ్గడం..

పూర్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉమ్మడి రైతు కుటుంబాలు ఉండేవి. ఈ కుటుంబాలు ఎక్కువ మంది వ్యవసాయం చేసేవారు. ప్రస్తుత కాలంలో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయాయి. దీనికి తోడు పొలం ఉన్న రైతులు ఆభూమిని సాగు చేయకుండా కౌలుకు ఇస్తున్నారు. ప్రస్తుత రైతు కుటుంబాలు ఉద్యోగాలపై మక్కువ చూపడంతో వ్యవసాయం చేయకపోవడంతో కౌలు రైతులు పెరిగిపోయారు.

వ్యవసాయంలో పెరిగిన యాంత్రీకరణ..

గతంలో వరి నారుమళ్లు పోసి నాట్లు వేసి కూలీలతో కోతలు కోసి, కుప్పలు వేసి అనంతరం కుప్పలు నూర్పిళ్లు చేసి ధాన్యం ఎద్దుల బండితో ఇంటికి తోలుకొని నిల్వచేసుకొనే వారు. నిల్వ చేసుకున్న ధాన్యం మద్దతు ధరలు వచ్చినపుడు తమకుంటుంబ అవసరాల మేరకు నిల్వ ఉంచుకునే వారు. మిగిలిన ధాన్యాన్ని విక్రయించుకొనేవారు. అయితే ఆధునిక కాలంలో యాంత్రీకరణ రావడంతో కౌలు రైతులు పంట పండించిన వరి ధాన్య పంట మీదనే యంత్రాల సాయంతో కోత కోసి పొలంలోనే బ్రోకర్లకు విక్రయిస్తున్నారు. రైతు కుటుంబాలకు కావాల్సిన బియ్యం మార్కెట్‌లో కొనుగోలు చేసుకుంటున్నారు.

> **దళారులే ధాన్యాన్ని తీసుకెళ్తున్నారు.**
> వరి పండించిన రైతుల పొలాల దగ్గరకే దళారులు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. దీని వలన రైతులు రైసు మిల్లులకు రావడం తగ్గిపోయారు. దీనితో మిల్లుల వినియోగం తగ్గింది.
> – పీ శంకరావు, వేటపాలెం, మిల్లర్

ధాన్యం మిల్లులు మూతకు కారణాలు ఇవే..

రైస్ మిల్లులకు చాలినన్ని ధాన్యం రాకపోవడం, మిల్లులు నిర్వహణ, విద్యుత్ చార్జీలు పెరగడం వంటి కారణాలతో రైస్ మిల్లులు మూత పడుతున్నాయి. పెద్ద మిల్లుల నుంచి నేరుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడతో పాటు పాతకాలం నాటి మిల్లులు మూతపడుతున్నాయి.

ఉపాధి కోల్పోతున్న యువత..

గతంలో ఒక రైస్ మిల్లులో 6 నుంచి 10 మంది వరకు పనులు చేసేవారు. ప్రస్తుతం తగినంత ధాన్యం లేకపోవడంతో ఒకరు, లేక ఇద్దరు కూలీలతో ధాన్యం మిల్లులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న ధ్యాన్యం మిల్లులు 60 శాతం మూత పడ్డాయి.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చినగంజాం (పర్చూరు): విజయవాడ నడిబొడ్డులోని అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కఠారి అప్పారావు అన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహంపై దాడికి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిని ప్రభుత్వం వెంటనే శిక్షించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గాజుల రమేష్, ఒగ్గిశెట్టి ప్రసాద్, లంకా శివ, కంచనపల్లి రమేష్, మల్లా శ్రీనివాసరావు, తులసి శివ నాగేశ్వరరావు, గేరా స్వరాజ్ కుమార్, కూరకుల చెంచు, కాకి అశోక్, బిళ్లా రాజేష్, విజయ్, మద్దిరాల శాంతారావు, యెహోషువ, నల్లమోతు శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు చేయూత


వృద్ధ దంపతులకు ఆర్థిక సహాయం అందిస్తున్న హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు

మార్టూరు: ఏ ఆసరా లేని వృద్ధ దంపతులకు మార్టూరుకు చెందిన హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు ఆదివారం సాయంత్రం ఆర్థిక సహాయం అందించారు. స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో నివాసం ఉండే 70 సంవత్సరాల వయసు గల బొచ్చ పోలయ్యకు 65 సంవత్సరాల వయసు గల భార్య బొచ్చ గురవమ్మ దంపతులకు సంతానం కానీ సొంత ఇల్లు కానీ లేక భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు. ఇటీవల కనీసం కదలలేని స్థితిలో ఉన్న వీరి విషయం తెలుసుకున్న సంస్థ ప్రతినిధులు ఆదివారం సాయంత్రం వారి నివాసానికి వెళ్లి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమాలు పఠాన్ ఖాదర్ వలీ, గుర్రం శ్రీను, పుట్ట అయ్యప్ప స్వామి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రేణుక ఎల్లమ్మ తల్లి కొలుపులు


రేణుక ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామంలో కొలువైయున్న రేణుక ఎల్లమ్మ తల్లి కొలుపులు ఆదివారం అట్టహాసంగా సాగాయి. మూడో వార్షిక తిరునాళ్ల పురస్కరించుకొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొలుపులకు దూరప్రాంతాల నుంచి వచ్చిన బంధువులతో గ్రామం పండుగ వాతావరణంతో నిండిపోయింది. దేవస్థానంలో మొక్కులను పెద్ద ఎత్తున చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత


మేదరమెట్ల ఎస్సై షేక్ మహ్మద్ రఫీ


యద్దనపూడి ఎస్సైగా రత్నకుమారి


వీ వెంకట్రావు, ఎస్ఐ, కారంచేడు

మేదరమెట్ల: మండలంలో శాంతి, భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని నూతన ఎస్సైలు పేర్కొన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల పోలీసు స్టేషన్‌కు నూతన ఎస్సైగా షేక్ మహ్మద్ రఫీ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన చంద్రశేఖర్ బదిలీపై ఈపురుపాలెం వెళ్లగా చుండూరు ఎస్సైగా పనిచేసిన ఈయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తమ స్టేషన్ పరిధిలో గల ప్రజానీకం వారికి ఎలాంటి సమస్య వచ్చినా తనను నేరుగా కలసి సమస్య పరిష్కరించుకోవచ్చన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తనతోపాటుగా సిబ్బంది ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసులుగా ఉంటామన్నారు.

యద్దనపూడి ఎస్సైగా రత్నకుమారి..

యద్దనపూడి: యద్దనపూడి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రత్నకుమారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై జీవి చౌదరి బల్లికురవ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది రత్నకుమారికి శాలువాతో ఘనంగా స్వాగతం పలికారు.

అసాంఘిక చర్యలపై ప్రత్యేక దృష్టి..

కారంచేడు: మండలంలోని గ్రామాల్లో జరిగే అసాంఘిక చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఎస్సై వీ వెంకట్రావు అన్నారు. ఆదివారం ఆయన కారంచేడు పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా భాధ్యతలు తీసుకున్నారు. ఈయన బాపట్ల వీఆర్ నుండి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కే సురేష్‌ను బాపట్ల వీఆర్‌కు పిలిచారు.

వాడరేవులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు


తీరం ఒడ్డున ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

చీరాల టౌన్: పర్యాటకులు అధికంగా వచ్చే వాడరేవు తీరప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నామని పంచాయతీ సెక్రటరీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు సముద్ర తీర ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ప్రొక్లెయినర్లతో చిల్లచెట్లు తొలగించి పేరుకున్న వ్యర్థా కుప్పలను తొలగించి శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, పర్యాటకులు ఇబ్బందులు పడకుండా తీరం ఒడ్డున, గ్రామంలోని వార్డుల్లో పనులు చేయిస్తున్నామని సెక్రటరీ తెలిపారు.

తీరంలో సండే సందడి


సముద్రంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: వాడరేవు సముద్ర తీరం సందడి నెలకొంది. ఆదివారం కావడంతో చీరాల, పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని నర్సరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల్లోని గ్రామాలతో పాటుగా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధిక సంఖ్యలో వాడరేవుకు చేరుకున్నారు. సముద్రపు ఇసుకతో ఆడలాడుతుకుంటూ కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానాలు ఆచరించారు. తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామికి, గ్రామంలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీరంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా సివిల్, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా శివాలయ శత వార్షికోత్సవం


హోమం చేస్తున్న ధర్మకర్త, గ్రామస్తులు


విశేష అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి

యద్దనపూడి: మండలంలోని గన్నవరం గ్రామంలో కొలువై ఉన్న గంగాకాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ శతవర్ష వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1924 శ్రావణ మాసంలో నిర్మించిన ఈ ఆలయం నూరు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆలయంలో స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచసూక్తహోమం, రుద్రహోమం, చండీహోమం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాళహస్తి హరిబాబు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి నూతనవస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముగిసిన ప్రతిష్ట వేడుకలు


ప్రతిష్ట వేడుకల్లో పాల్గొన్న మహిళలు

బల్లికురవ: దుష్టశక్తులు గ్రామంలోకి ప్రవేశించకుండా గ్రామం చుట్టూ గవిడిరాళ్లు ఏర్పాటు చేసుకోవటం అనాదిగా వస్తున్న ఆచారమని బ్రహ్మంగారి ప్రతిష్టాచార్యులు గోవిందస్వామి అన్నారు. మండలంలోని పాతమల్లాయపాలెం గ్రామంలో గవిడ రాళ్ల ప్రతిష్ట వేడుకలు శుక్రవారం ప్రారంభమై ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. యాగశాల ప్రవేశం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం కలశ పూజలు, హోమాలు, కుంకుమ పూజలు చేపట్టారు. ఆదివారం ఉదయం 9.14 గంటలకు గోవింద స్వామి బృందంచే మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య గ్రామం చుట్టూ గవిడి రాళ్లు ప్రతిష్టించారు. నాభిశిలకు ప్రత్యేకపూజలతో అలంకరించారు. వేడుకల ముగింపులో భాగంగా సుమారు పదివేల మందికి అన్నసంతర్పణ చేపట్టారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

నిత్యావసరాల పంపిణీ


రామకృష్ణను సత్కరిస్తున్న వాకింగ్ సభ్యులు

చీరాల రూరల్: వాకర్స్ అసోసియేషన్ అద్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, మహాలక్ష్మి దంపతుల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగసాయి, వైష్ణవి సహకారంతో ఆదివారం స్థానిక ఎస్ఆర్అండ్‌పిఎం హైస్కూలు క్రీడా మైదానంలో కోటయ్య అనాథశ్రమం, నవాబుపేటలోని పాండురంగ అనాథశ్రమానికి ఒక బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొడవర్తి సుధాకర్, శ్రీరాం రమేష్, అమరా వీరాంజనేయులు, గుర్రంర బదరీనాద్, మద్దు వెంకట సుబ్బారావు, నారాయణరావు, పూర్ణచంద్రరావు, చెన్ననారాయణ, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ పతాకంతో ర్యాలీ


జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పరస్కరించుకుని ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేడుకలు నిర్వహించారు. దానిలో భాగంగా విద్యార్థులు జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయేది 78వ స్వాతంత్ర్య దినోత్సవమని చెప్పారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల: నియోజకవర్గంలో ఉన్న గొర్రెలు, మేకల పెంపకందారులకు ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభను నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న గ్రామ పంచాయతీల్లో గొర్రెలు, మేకల పెంపకందారులు అధికంగా ఉన్నారని, వారికి ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటుగా ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని ప్రోత్సాహకాన్ని అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి, బి.అంజనేయులు, కె.తిరుపతి రావు, బాబూరావు, వసంతరావు, అధిక సంఖ్యలో పెంపకందారులు పాల్గొన్నారు.